ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం: మంత్రి

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు వైకాపా నేత జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. రేపల్లె తెదేపా కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. గత వైకాపా పాలనలో సుమారు రెండు లక్షల మంది మహిళలపై అఘాయిత్యాలు జరిగాయని ఆరోపించారు. మహిళల భద్రత కోసం జగన్ ప్రభుత్వం రూపొందించిన దిశ చట్టం ద్వారా ఒక్క బాధితురాలికీ న్యాయం జరగలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు.


మాట్లాడుతున్న మంత్రి అనగాని, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్

ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనుడు జగన్‌మోహనరెడ్డి అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధ్వజమెత్తారు. అయిదేళ్ల పాలనలో రాష్ట్రంలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా మోసాలను గమనించిన ప్రజలు సంచలనాత్మక తీర్పు ఇచ్చారన్నారు. నాయకులు మత్తి భాస్కరరావు, పంతాని మురళీధరరావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, పట్టాభి రామారావు, వెంకటశివ రామకృష్ణ, వెంకటగోపాలరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారిగా పురుషోత్తం

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారిగా ఎస్.పురుషోత్తం నియమితులయ్యారు. మదనపల్లి డీవైఈవోగా పనిచేస్తున్న ఆయనను ఎన్టీఆర్ జిల్లా ఉప సంచాలకుడిగా బదిలీ చేశారు. పూర్తి అదనపు బాధ్యతలతో బాపట్ల డీఈవోగా నియమించారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న కె.నారాయణరావు ఒంగోలు మైనంపాడు డైట్ కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ అయ్యారు.

పైకమిస్తేనే పత్రాలు

- ★ నాడు బోధన రుసుములు చెల్లించని జగన్ సర్కారు
- ★ ధ్రువపత్రాలు లేక అవకాశాలు కోల్పోతున్న విద్యార్థులు
- ★ కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా ససేమిరా అంటున్న కళాశాలల యాజమాన్యాలు

గుంటూరుకు చెందిన శ్రీలక్ష్మి చీరాల ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసింది. ఈమెకు మంగళగిరి టెక్‌పార్కులో ఉద్యోగం వచ్చింది. మార్కుల ధ్రువపత్రాలతో హాజరుకావాలని వచ్చిన కాల్ లెటర్‌తో కళాశాలకు వెళ్లి అడగ్గా ఇంకా రూ.35 వేల బకాయిలు చెల్లిస్తేనే అవి ఇస్తామంటూ బదులొచ్చింది.

పొన్నూరుకు చెందిన వెంకటేశ్వరరావు ప్రత్తిపాడుకు సమీపంలోని ఓ కళాశాలలో ఎంబీఏ పూర్తి చేశారు. ఈయనకు జాబ్ ఆఫర్ వచ్చింది. మార్కుల ధ్రువపత్రాల కోసం కళాశాలకు వెళ్లి.. ప్రభుత్వం నుంచి బోధన రుసుములు రాగానే బకాయిలు చెల్లిస్తానని అండర్ టేకింగ్ లేఖ ఇస్తానని చెప్పినా యాజమాన్యం ససేమిరా అంది. టీసీ, మార్కుల పత్రాలివ్వని కారణంగా ఉద్యోగం దూరమైంది.

ఈనాడు, అమరావతి

మీ పిల్లలు పెద్ద చదువులు చదవాలి.. ఇంజినీర్లు, డాక్టర్లు కావాలి.. ఆ చదువులకు బాధ్యత నాది.. అందుకవసరమయ్యే ఫీజులు మీ అన్న చెల్లిస్తారంటూ గత ఎన్నికల ముందు వరకు బాకా ఊదిన జగన్‌మోహన్‌రెడ్డి చివరకు విద్యార్థులను నిలువునా ముంచేశారు. 2023-24 విద్యా సంవత్సరంలో బోధన రుసుములు, విద్యా దీవెన జమ చేయని కారణంగా వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల చేతికి ధ్రువపత్రాలు అందని పరిస్థితి. పిల్లల ఫీజులు చెల్లించకుండా ఆ మొత్తాన్ని నాటి జగన్ సర్కారు దారి మళ్లించడం వల్లనే గత విద్యా సంవత్సరంలో మూడు ఇన్‌స్టాల్‌మెంట్లు విడుదల కాలేదని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి.



☛ 2023-24 విద్యా సంవత్సరంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీఎడ్ తదితర వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు 20 వేలకు పైగానే ఉంటారని విద్యాశాఖవర్గాల సమాచారం. వీరిలో మూడొంతుల మంది బోధన రుసుములు, విద్యా దీవెన ఫీజులపై ఆధారపడి చదినవారే. ప్రస్తుతం అప్పోసప్పో చేసి కళాశాలలకు బకాయిలు చెల్లించి ధ్రువపత్రాలు తీసుకెళ్లాల్సి వస్తోంది.

☛ గత వైకాపా ప్రభుత్వ నిర్వాకం వల్ల విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేకపోతున్న విషయం తెలిసి తెదేపా కూటమి ప్రభుత్వం.. వారిని ఇబ్బంది పెట్టొద్దని, బకాయిలను విడుదల చేస్తామని, సంబంధిత పత్రాలు ఇచ్చేయ్యాలని ఆదేశించినా కళాశాలల యాజమాన్యాలు ససేమిరా అంటున్నాయి.

విద్యార్థులే చెల్లించాలని మెలిక

బోధన రుసుములు చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను బలవంతపెడుతున్నాయి. 2024 ఏప్రిల్‌తో ముగిసిన విద్యా సంవత్సరానికి మిగిలిన మూడు వాయిదాలను చెల్లించాల్సిందేనని పట్టుబడుతున్నాయి. పైగా ఈ విషయాన్ని బహిరంగంగానే అంగీకరిస్తున్నాయి. విద్యార్థుల చేతికి పత్రాలిస్తే వారి తల్లుల ఖాతాలకు జమైన రుసుమును కళాశాలలకు చెల్లించరని అందుకే బకాయిలు ముందే కట్టాలని చెబుతున్నామని ఇంజినీరింగ్ కళాశాలల అసోసియేషన్ నాయకుడొకరు తెలిపారు.

గ్రానైట్ మాఫియాకు ఒకే ఒక్కడు

- అక్రమంగా సరిహద్దు దాటిస్తున్న ఘనుడు
- అమ్యామ్యాలతో పట్టించుకోని అధికారగణం

మార్టూరు, పర్చూరు, న్యూస్‌టుడే

నిత్యం రూ.కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ.. గ్రానైట్ అక్రమంగా సరిహద్దులు దాటిపోతుంది. నిత్యం వందల సంఖ్యలో గ్రానైట్ పలకలను ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నారు. మార్టూరు ప్రాంతంలో మాఫియాను ఈ ప్రాంతానికి చెందిన ఒకేఒక్కడు శాసిస్తూ గ్రానైట్ ఎగుమతులు చేపట్టడం గమనార్హం. గతంలో ముఠాలుగా ఏర్పడి గ్రానైట్ రవాణాలో అక్రమాలకు పాల్పడటం జరిగేది. కానీ ఇప్పుడు పరిస్థితి భిన్నంగా మారింది. ఆ ఒక్కడి కనుసన్నల్లోనే ఎగుమతులు సాగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇంత జరుగుతున్నా ఆయా శాఖల అధికారులు మాత్రం ఏమి పట్టనట్లు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.


మార్టూరు స్టేషన్ వద్ద ఇటీవల పట్టుబడిన గ్రానైట్ పలకల వాహనాలు

లారీ కదలాలంటే రూ.28 వేలు కప్పం కట్టాల్సిందే..: గ్రానైట్ పలకల అక్రమ రవాణాను మార్టూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నడిపించడం చర్చనీయాంశంగా మారింది. ఇతనికి నిత్యం రూ.లక్షల్లో కాసుల వర్షం కురిపిస్తుంది. ఇందుకు కొన్ని శాఖల అధికారులు లంచాలు తీసుకొని సహకరించడం చెప్పుకోవాల్సిన విషయం. దీంతో చేసేది లేక ఎగుమతి సమయంలో ఆ ఒక్కడిని ఆశ్రయించి వారి వాహనం ముందుకు కదిలేలా కప్పం కడుతున్నారు. మాఫియాను ఏలుతున్న ఒకేఒక్కడికి ఒక్కో లారీకి రూ.28 వేలు చెల్లిస్తేనే రాష్ట్ర సరిహద్దులు దాటేందుకు మార్గం సుగమమవుతుంది. నిత్యం ఈ ప్రాంతం నుంచి సుమారు 100 గ్రానైట్ పలకల వాహనాలు ఇతర రాష్ట్రాలకు రవాణా సాగిస్తున్నట్లు గణాంకాల్లో వెల్లడవుతోంది. అంతేకాక ఈ ఒక్కడే ప్రతిరోజు మార్టూరు, బల్లికురవ ప్రాంతాల నుంచి 10కి పైగా గ్రానైట్ శ్లాబ్ వాహనాలను ఎగుమతులు నిర్వహిస్తున్నాడు.


తాతపూడి వద్ద ఏఎంఆర్ సంస్థ చెక్‌పోస్టు

☛ ఎన్నికలకు ముందు ఓ ప్రైవేటు సంస్థ మైనింగ్ పన్ను వసూలు చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందింది. ఎవరైనా మైనింగ్ ఎగుమతులు సాగించాలంటే తమ జిల్లా పరిధిలో తమకు పన్ను చెల్లించేలా శాఖాపరమైన అనుమతులు తీసుకుంది. సమీప జిల్లాలకు మాత్రమే అప్పటి ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు మైనింగ్ వసూలును కట్టబెట్టింది. ఆయా జిల్లాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించి పన్ను వసూలు చేసేవారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాక ఈ చెక్‌పోస్టులపై విమర్శలు రావడంతో వీటిని కొద్దిరోజులు మూసివేశారు. అయితే మరలా ఆ సంస్థ కొత్త ప్రభుత్వంలోను మైనింగ్ పన్ను వసూలు చేసుకునేందుకు అనుమతులు పొందింది. కొద్దిరోజులుగా పక్క జిల్లాలోని ఆయా ప్రాంతంలో యథావిధిగా వారి పన్ను వసూలు కార్యకలాపాలను సిబ్బందితో సాగిస్తున్నారు. కానీ పాత ప్రకాశం జిల్లాలో ఏ ప్రైవేటు సంస్థకు ఇలాంటి పన్ను వసూలు అజమాయిషీ లేదు. దీంతో ఇక్కడి మైనింగ్ వ్యాపారులు ప్రభుత్వానికి పన్ను చెల్లించి ఎగుమతులు చేపట్టాల్సి ఉంది. ఒకవేళ బిల్లులేని వాహనాలు పక్క జిల్లాలోకి ప్రవేశిస్తే అక్కడ ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థకు వారు విధించిన పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీంతో గ్రానైట్ అక్రమ రవాణాలో సిద్ధహస్తుడైన ఆ ఒకేఒక్కడు చక్రం తిప్పుతూ యథేచ్ఛగా గ్రానైట్ ఎగుమతులను అక్రమ మార్గాల్లోకి మారుస్తూ తనదైన శైలిలో సరిహద్దు దాటిస్తున్నాడు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నాడు.

నిత్యం రాత్రి వేళ తనిఖీలు నిర్వహిస్తాం

ప్రభుత్వ ఆదాయానికి ఎవరైనా గండి కొడితే ఊరుకునేది లేదు. గ్రానైట్ అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అపరాధ రుసుం విధిస్తాం. ప్రతిరోజు మా సిబ్బందితో బృందాలుగా తనిఖీలు నిర్వహించి అక్రమ ఎగుమతులను అరికట్టేలా చర్యలు తీసుకుంటాం. **- రాజేశ్, మైనింగ్ ఏడీ, బాపట్ల**

బాపట్ల డీఆర్వోగా గంగాధర గౌడ్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లా నూతన రెవెన్యూ అధికారిగా గంగాధర్ గౌడ్ నియమితులయ్యారు. వైఎస్సార్ కడప జిల్లా నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వస్తున్నారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పని చేసిన సీహెచ్ సత్తిబాబుకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి వద్ద రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. డీఆర్వోగా సత్తిబాబు జిల్లాలో ఎనిమిది నెలల పాటు సేవలందించారు.

చీరాల ఆర్డీవోగా చంద్రశేఖర్ నాయుడు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల ఆర్డీవోగా తూమాటి చంద్రశేఖరు నియమితులయ్యారు. ఈయన తిరుపతి డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న దేవరకొండ అఖిలను రామచంద్రాపురం ఆర్డీవోగా బదిలీ చేసినట్లు సాధారణ పరిపాలనశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.

ఏడాదికే కుంగిందిలా!



పట్టణంలో మార్కెట్‌యార్డు నుంచి బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల వరకు గత వైకాపా పాలనలో రూ.72 కోట్ల వ్యయంతో 8.5 కి.మీ. పొడవునా చేపట్టిన 216ఏ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో అడుగడుగునా నాణ్యతా లోపాలు కనిపిస్తున్నాయి. పడమర బాపట్లలో సుమంత్ రైస్ మిల్లు సమీపంలో జాతీయ రహదారి కుంగింది. నిర్మించి ఏడాది పూర్తవకముందే ఇలా జరగటం గమనార్హం. రహదారిపై మురుగునీటి పారుదల వ్యవస్థ సరిగా లేదు. విద్యుత్తు శాఖ కార్యాలయం వద్ద రహదారిపై వర్షపు నీరు నిలుస్తోంది. దీనిపై ఎన్‌హెచ్ జేఈ పురుషోత్తంను సంప్రదించటానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. **- బాపట్ల, న్యూస్‌టుడే**

ఉపాధి పథకం సద్వినియోగంతో అభివృద్ధి

వేమూరు, రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేయాలని కేంద్ర బృందం సభ్యులు లోహిత్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకునేందుకు వారు జిల్లాలో పర్యటించారు. వేమూరు మండలం జంపని, వరహాపురం పంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు, పలు సీసీ రోడ్లు, సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచి పెదమరియమ్మ తదితరులు పాల్గొన్నారు. రేపల్లె మండలం సింగుపాలెం, గుడ్డికాయలంక గ్రామాల్లో గత మూడేళ్లలో నిర్మించిన సీసీ రోడ్లు, ఉపాధిహామీ పథకం ద్వారా జరిగిన పనులు పరిశీలించారు. పలువురు పింఛనుదారులతో మాట్లాడారు. డ్వామా ఏపీడీ సువార్త, ఎంపీడీవో శోభారాణి, ఈవోపీఆర్డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వేమూరు: డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు లోహిత్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి

నేటి నుంచి జిల్లాలో పశుగణన

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో పశుగణన కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు జేసీ ప్రఖర్‌జైన్ తెలిపారు. పశుగణనకు సంబంధించిన గోడపత్రాలు, స్టిక్కర్లు, సూచన పుస్తకాలను ఆయన గురువారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశమంతా పశుగణన కార్యక్రమం ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి పశుపోషకులు సహకరించాలన్నారు. జిల్లాలో 4.80 లక్షల కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబాన్ని సందర్శించి పశుగణన చేపట్టేందుకు అధికారులు, సిబ్బంది అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. పశుగణన ప్రక్రియ పూర్తయితే ప్రతి ఇంటి ముందు తలుపు కుడి ఎగువ మూలలో స్టిక్కర్లు ఉంచాలన్నారు. పశుగణన ద్వారా పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలతో పాటు వివిధ రకాల కోళ్లు, పక్షులతో సహా 16 రకాల పెంపుడు జంతువులపై జాతుల వారీగా సమాచారాన్ని సేకరిస్తారన్నారు. ఈ గణన ప్రక్రియ పశుసంవర్ధక రంగంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి తోడ్పడే కార్యక్రమాల రూపకల్పనకు ఉపకరిస్తుందన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి బి.వేణుగోపాల్, నోడల్ అధికారి వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న జేసీ ప్రఖర్‌జైన్

బండ జారింది.. గుండె ఝల్లుమంది!



ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా గ్రానైట్ భారీ ముడిరాళ్లను తరలిస్తున్నారనడానికి ఈ చిత్రమే ప్రత్యక్ష సాక్ష్యం. గురువారం దండుదోవ మార్గంలో ఓ గ్రానైట్ పరిశ్రమకు తరలిస్తున్న 40 టన్నుల గ్రానైట్ ముడిరాయి నడిరోడ్డుపై అదుపు తప్పి పడిపోయింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో మార్టూరు-గన్నవరం మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే గ్రానైట్ వ్యాపార వర్గాల తీరుపై ప్రజలు నిరసన వ్యక్తంచేస్తున్నారు. **- న్యూస్‌టుడే, మార్టూరు, యద్దనపూడి**

తూకంలో మోసాలకు పాల్పడితే చర్యలు


మేదరమెట్లలో బియ్యం బస్తా బరువు పరిశీలిస్తున్న అధికారి నాగేశ్వరరావు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: తూనికల విషయంలో వినియోగదారులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలోని దుకాణాల్లో ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని ఎలక్ట్రిక్ కాటాలు పరిశీలించారు. బియ్యం బస్తా బరువును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..గ్రామంలో అయిదు దుకాణాల్లో ముద్రలేని కాటాలు వినియోగిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బియ్యం బస్తాల విషయంలో ఎలాంటి పొరబాట్లు జరగడం లేదన్నారు. అక్రమాలు జరిగితే తన దృష్టికి తీసుకురావాలని వినియోగదారులను ఆయన కోరారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

బాపట్ల, న్యూస్‌టుడే: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు అంకితభావంతో పని చేయాలని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అదనపు సంచాలకుడు వరుణ్ గైకి అన్నారు. రెండ్రోజుల జిల్లా పర్యటనలో ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వైద్య సేవలను పరిశీలించిన కేంద్రం బృందం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో విజయమ్మతో గురువారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మహిళలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత సమస్య నివారణకు గట్టిగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. డయేరియా బాధితులకు సత్వర వైద్యం అందించాలన్నారు. డీఎంహెచ్‌వో విజయమ్మ మాట్లాడుతూ గర్భిణులకు నిరంతరం వైద్య పరీక్షలు చేయిస్తూ మాతా శిశు మరణాలు పూర్తిగా తగ్గించటానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా చూస్తున్నామన్నారు. డీఐవో వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.



కేంద్ర బృంద సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న అదనపు సంచాలకుడు వరుణ్‌గైకి, డీఎంహెచ్‌వో విజయమ్మ

రాజధానికి.. మరో మణిహారం!

- ✦ అమరావతి రైల్వేలైన్‌తో ఈ ప్రాంతానికి మహర్దశ
- ✦ ఉమ్మడి కృష్ణా, గుంటూరువాసులకు వరం
- ✦ విజయవాడకు వెలుపల ఎర్రుపాలెం నుంచి ఆరంభం
- ✦ గుంటూరుకు ముందు నంబూరు స్టేషన్ వద్ద కలుస్తుంది







"**అ**మరావతి రైల్వేలైన్‌కు కేంద్రం పచ్చజెండా ఊపడంతో ఇది రాజధానికి మరో మణిహారంగా మారబోతోంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు, ప్రధానంగా విజయవాడ, గుంటూరు నగరాలకు వరంగా మారబోతోంది. విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ భారీగా తగ్గించబోతోంది. విజయవాడతో సంబంధం లేకుండా 39 కిలోమీటర్ల దూరంలో మలుపు తిరిగి.. అమరావతి మీదుగా గుంటూరు, అక్కడి నుంచి ఇతర నగరాలకు తేలికగా చేరుకునేందుకు వీలు కలుగుతుంది. ఈ లైన్‌ను ఐకానిక్‌గా మార్చి పర్యాటకులను సైతం ఆకర్షించడంపైనా.. ప్రభుత్వం దృష్టి సారించింది. 57 కిలోమీటర్ల అమరావతి రైల్వే లైన్‌లో.. కృష్ణా నదిపై నిర్మించబోయే 3.2 కి.మీ. ఐకానిక్ వంతెన పర్యాటకులను ఆకర్షించబోతోంది. ఈ రైల్వేలైన్ పర్యావరణహితంగానూ ఉండబోతోంది. ఈ నూతన లైన్‌తో వాహన కాలుష్యాన్ని సైతం పెద్దఎత్తున తగ్గించబోతున్నారు."

ఈనాడు, అమరావతి

దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యంత రద్దీ స్టేషన్లలో విజయవాడ ఒకటి. నిత్యం రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం 250 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. రోజుకు సాధారణ రోజుల్లోనే లక్ష మందికి పైగా ప్రయాణికులు వచ్చి వెళుతుంటారు. సెలవులు, పండగ రోజుల్లో రెండు లక్షల మంది దాటుతుంటారు. అందుకే రైళ్ల రాకపోకల్లో జాప్యం, స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రత్యామ్నాయంగా విజయవాడకు చుట్టుపక్కల ఉన్న కృష్ణాకెనాల్(తాడేపల్లి), గుణదల, రాయనపాడు స్టేషన్లను శాటిలైట్‌గా మార్చాలనే ప్రతిపాదన చాలా కాలంగా ఉంది. తాజాగా అమరావతి లైన్‌కు కూడా ఆమోద ముద్ర పడడంతో.. గుంటూరు వైపు వెళ్లే రైళ్లు.. విజయవాడకు రావాల్సిన అవసరం ఉండదు.

అనుసంధాన "మస్తు"!

ఎర్రుపాలెం-నంబూరు మధ్యలో తొమ్మిది కొత్త స్టేషన్లు రానుండడంతో ఈ ప్రాంతాలన్నింటికీ రైలు కనెక్టివిటీ ఏర్పడుతుంది. తద్వారా వాహన కాలుష్యం విపరీతంగా తగ్గుతుంది. పరిటాల రైల్వేస్టేషన్ వద్ద మల్టీమోడల్ కార్గో టెర్మినల్‌ను నిర్మించనున్నారు. వీటన్నింటికి తోడు కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అసలు సంబంధమే లేకుండా ఉండేలా ఈ నూతన లైన్‌ను పర్యావరణహితంగా నిర్మించనున్నారు.

విజయవాడ బయట నుంచే వెళ్లేలా..

దిల్లీ ప్రధాన లైన్‌లో వచ్చే రైళ్లు విజయవాడతో సంబంధం లేకుండా నేరుగా అమరావతి మీదుగా గుంటూరుకు వెళ్లిపోవచ్చు. విజయవాడకు 39 కిలోమీటర్ల దూరంలో కొండపల్లి రిజర్వ్‌ఫారెస్ట్‌కు వెలుపలి నుంచి సరిగ్గా ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ వద్ద నుంచి ఈ లైన్‌ను అమరావతికి అనుసంధానం చేస్తారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు స్టేషన్‌కు కలుపుతారు. నంబూరు నుంచి గుంటూరుకు వెళ్లిపోవచ్చు. విజయవాడ, గుంటూరు మధ్యలో నంబూరు ఉంటుంది. ఈ నూతన లైన్ విజయవాడకు బైపాస్ లాంటిదే. భవిష్యత్తులో ఈ లైన్ అత్యంత ప్రధానమైన మార్గంగా మారబోతోంది. అమరావతి నుంచి ఎర్రుపాలెం వైపు వస్తే దిల్లీ, హైదరాబాద్, అహ్మదాబాద్, ముంబయి వెళ్లిపోవచ్చు. నంబూరు నుంచి గుంటూరు స్టేషన్, అక్కడి నుంచి తెనాలి వస్తే ప్రధాన రైల్వే లైన్‌లో కలిసిపోతుంది. అక్కడినుంచి విశాఖ, చెన్నై, బెంగళూరు, కేరళ వరకూ వెళ్లిపోవచ్చు.

పర్యాటకాభివృద్ధికి దోహదపడేలా నిర్మాణం

అమరావతిని దేశంలో ప్రధాన నగరాలు అన్నింటితో కలిపేందుకు ఈ నూతన లైన్ దోహదపడుతుంది. ఈ నూతన లైన్‌ను అనుకున్న లక్ష్యంలోగా పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించబోయే ఈ లైన్‌లో అనేక విశేషాలుంటాయి. ఐకానిక్ వంతెన కూడా కృష్ణా నదిపై వస్తుండడంతో పర్యాటకాభివృద్ధికి సైతం దోహదపడుతుంది.
- పి.ఈ.ఎడ్విన్, ఏడీఆర్ఎం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విజయవాడ రైల్వేడివిజన్

వడ్డివారిపాలెం వాసికి ఆదర్శ రైతు పురస్కారం



ఆదర్శరైతు పురస్కారం అందుకుంటున్న రమణ

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మండలం వడ్డివారిపాలెంకు చెందిన తులం రమణ హైదరాబాద్ రాజేంద్రనగర్ జాతీయ వరి పరిశోధన సంస్థ నుంచి ఆదర్శ రైతు అవార్డు అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన జాతీయ రైతు దినోత్సవంలో రైతు సలహా సంఘం ఛైర్మన్ కోదండరెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్, అగ్రికల్చరల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జానకయ్య ఈ అవార్డును రమణకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ శాస్త్రవేత్త సుందరం, నాగూర్‌మీరా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ జాతీయ వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాసప్రసాద్, సాయిప్రసాద్ సూచనల మేరకు 2023లో సాంబమసూరి వంగడంతో ఎకరాకు 40 బస్తాల వరిధాన్యం దిగుబడి సాధించానన్నారు. అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

డిసెంబరు 15 లోగా పంటల బీమా నమోదు పూర్తి

బాపట్ల: పంటల బీమా నమోదు ప్రక్రియ డిసెంబరు 15 లోగా ముగించాలని జేసీ ప్రఖర్‌జైన్ అన్నారు. కలెక్టరేట్లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. పంటల బీమా పథకానికి రైతుల పేర్ల నమోదు ప్రక్రియ వేగంగా చేపట్టాలని పేర్కొన్నారు. బీమా పథకానికి రైతులే ప్రీమియం చెల్లించాల్సి ఉందని... సీఎస్సీ కేంద్రం, సచివాలయాలకు వచ్చే రైతులు తమ ప్రీమియం చెల్లించవచ్చన్నారు. సీసీఆర్సీ కార్డుదారులకు లబ్ధి చేకూర్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రైతులకు అవగాహన కల్పించటంలో నిర్లిప్తత ఉండరాదని పేర్కొన్నారు. డీఏవో రామకృష్ణ, ఉద్యానశాఖ ఏడీ జెన్నమ్మ, సీపీవో శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

పెరటి సాగు.. ఆరోగ్యం బాగు

పండ్లు, కూరగాయలు పండిస్తున్న మహిళలు

రేపల్లె అర్బన్, కనగాల, గుళ్లపల్లి, చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే



ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. ఎంత సంపాదించి ఉన్నా చక్కని ఆరోగ్యం లేకుంటే వృథా అన్న విషయం తెలిసిందే. ప్రస్తుత ఆధునిక పరిస్థితుల్లో సాగులో రసాయన ఎరువుల వినియోగంతో ఆరోగ్యం దెబ్బతింటోంది. దీంతో గ్రామీణ ప్రాంత మహిళలు తమ ఇంటి వద్దే కొద్ది మొత్తంలో కూరగాయలను పండిస్తున్నారు. వీటితో పాటు ఇంటి పెరట్లో వివిధ రకాలైన పండ్ల మొక్కలను పెంచుతున్నారు. ఇంట్లో నిత్యం పోగయ్యే కూరగాయ వ్యర్థాలతో సొంతంగా వర్మి కంపోస్టు ఎరువు తయారు చేస్తూ ఆ మొక్కలకు అందిస్తున్నారు. వారు పెంచే చెట్ల నుంచి వచ్చే ఫలాలు, కూరగాయలను కుటుంబ సభ్యులకు అందిస్తూ వారి ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్నారు. తీరంలో కొందరు మహిళలు ఈ ప్రాంతంలో అందుబాటులో లేని కొన్ని రకాల పండ్ల చెట్లను పెంచుతూ వాటి ఫలాలను కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులకు బహుమతిగా అందిస్తున్నారు. అలాంటి ఆదర్శ మహిళల గురించి తెలుసుకుందాం.

ఇంటి చుట్టూ పండ్ల చెట్లే



మాది చెరుకుపల్లి మండలం, నడింపల్లి. మా ఇంటి చుట్టూ పండ్ల మొక్కలున్నాయి. పనస, స్టార్ యాపిల్, వాటర్ యాపిల్, జామ, మామిడి వంటి పండ్ల మొక్కలు ఉన్నాయి. స్టార్, వాటర్ యాపిల్స్ మా ఇంటి ఆవరణలో ప్రత్యేకంగా పెంచుతున్నాం. ఈ పండ్ల మొక్కలను ప్రకృతి వ్యవసాయ విధానంలోనే పండిస్తున్నాం. ఈ పండ్లను కుటుంబ సభ్యులతోపాటు స్నేహితులకు బహుమతిగా అందిస్తున్నాం. వీటితో పాటు కాకర, పొట్లకాయ, వంగ, పుదీనా వంటి కూరగాయలు ఆకుకూరలు పండిస్తున్నాం. ఇవి మా ఇంట్లో సరిపోతున్నాయి. నేను ఇంటి వద్ద ఉన్నప్పుడు ఎక్కువగా పండ్ల చెట్ల సంరక్షణ చూస్తుంటాను. - **గోగినేని వసుధ, గృహిణి, నడింపల్లి**

వంటకు తోటలోవే వినియోగిస్తాం



15 ఏళ్లుగా ఇంటి పెరట్లో, ఆవరణలో కూరగాయలు పండించడం అలవాటు చేసుకున్నాను. పొట్ల, వంగ, బీర, కాకర, గోరుచిక్కుడు, బీన్స్, తోటకూర, గోంగూర, పుదీనా వంటి ఆకుకూరలు సాగు చేస్తున్నాను. సొంతంగా పండించిన కూరగాయలను మాత్రమే వంటకు వినియోగిస్తాము. కూరగాయ మొక్కలకు పాదులు తీసి నీటిని అందించి సంరక్షిస్తాను. నిత్యం సాయంత్రం వేళ నిశితంగా పరిశీలించి చీడపీడలు ఆశించకుండా దృష్టిసారిస్తున్నా. పెరట్లో అరటి, చక్కెర కేళీ, అమృత పాణి, జామ చెట్లు పెంచి ఆ ఫలాలు బంధువులు, స్నేహితులకు కూడా ఇస్తుంటాను. ఉదయం, సాయంత్రం కొద్ది సేపు పెరట్లో పచ్చని మొక్కల మధ్య గడిపితే సంతోషంగా ఉంటుంది. - **పరుచూరి శ్రీలక్ష్మి, గృహిణి, బేతపూడి**

హైదరాబాద్‌లో పిల్లలకు పంపిస్తా



ఆయిదేళ్లుగా 10 సెంట్ల భూమిలో బెండ, వంగ, సొర, కాకర, గోరుచిక్కుడు, మిర్చి, క్యాబేజి, ముల్లంగి, టమాటా కాయగూరలు సాగు చేస్తున్నాను. వీటితో పాటు బత్తాయి, నారింజ, జామ, నిమ్మ చెట్లు పెంచుతూ వాటి ఫలాలు తింటున్నాం. సేంద్రియ ఎరువులతో సాగు చేసిన కూరగాయలను హైదరాబాద్‌లో ఉంటున్న పిల్లలకు పంపిస్తున్నా. పండించిన టమాట, వంగ, పచ్చిమిర్చి, గోంగూరతో పచ్చళ్లు తయారు చేస్తాను. మార్కెట్లో విక్రయించే ఆకుకూరలు, కాయగూరల సాగుకు అధికంగా రసాయన ఎరువులు వినియోగిస్తున్నారన్న విమర్శ ఉంది. శ్రమ అనుకోకుండా పెరట్లో పండించిన కూరగాయలను కూరలకు వాడితే కుటుంబం పూర్తి ఆరోగ్యంగా ఉంటుందనే భావనతో ఇష్టంగా సాగు చేస్తున్నా. - **పరుచూరి పార్వతి, గృహిణి, బేతపూడి**

సొంతంగా వర్మికంపోస్టు తయారీ



మాది చెరుకుపల్లి మండలం, గూడవల్లి. మా ఇంట్లో నిత్యం పోగయ్యే వ్యర్థాలను తొట్టెలో వేసి భద్రపరుస్తాం. 40 రోజుల తరువాత అది ఎరువుగా మారుతుంది. దీన్ని మా పెరట్లో పెంచే పూలు, కూరగాయల మొక్కలకు వేస్తుంటాం. బెండ, కాకర, దొండ వంటి కూరగాయలు, పుదీనా, తోటకూర వంటి ఆకుకూరలు పెంచుతున్నాం. బంతి, కనకాంబరం వంటి పూల మొక్కలున్నాయి. మామిడి, సపోట, జామ వంటి పండ్ల మొక్కలు ఉన్నాయి. ఈ ఫలాలు మాతో పాటు స్నేహితులకు అందిస్తుంటాం. - **కె.లక్ష్మి, గృహిణి, గూడవల్లి**

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

రెండు కుటుంబాల్లో విషాదం నింపిన ప్రమాదం




షేక్ ఖాసింసైదా, షేక్ మీరావలి (పాతచిత్రాలు)

చిన్నకొత్తపల్లి(అద్దంకి), న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంపై అద్దంకి వస్తున్న ఇద్దరు స్నేహితులను బొలేరో వాహనం రూపంలో మృత్యువు కబళించింది. ఈ సంఘటన నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై చిన్నకొత్తపల్లి శివారు శ్రీనివాసనగర్ వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సీహెచ్.ప్రవీణ వివరాల మేరకు.. బల్లికురవ మండలం వి.కొప్పెరపాడుకు చెందిన షేక్ ఖాసిం సైదా(52), కొమ్మినేనివారిపాలెంలో నివాసముంటున్న షేక్ మీరావలి(55) ప్రాణ స్నేహితులు. ఇద్దరూ కలిసి టీవీఎస్ మోపెడ్‌పై వి.కొప్పెరపాడు నుంచి అద్దంకి వైపు వస్తున్నారు. ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్రం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన బొలేరో వాహనం పల్నాడు జిల్లా నరసరావుపేట నుంచి ప్రకాశం జిల్లా పొదిలికి వెళుతోంది. చిన్నకొత్తపల్లి శివారు శ్రీనివాసనగర్ దాటిన తరువాత ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని బొలేరో ఢీకొట్టి 200 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. షేడ్‌నెట్ వద్ద కూలీలు ప్రమాదాన్ని గుర్తించి వాహనాన్ని అడ్డుకున్నారు. 108 వాహనం సకాలంలో రాలేదు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరు రక్తగాయాలతో రోడ్డుపై కొట్టుమిట్టాడారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మీరావలి మృతి చెందాడు. దాదాపు 35 నిమిషాల తరువాత సంఘటనా స్థలానికి చేరుకున్న 108 వాహనంలో ఎక్కించేందుకు ప్రయత్నించగా ఖాసిం సైదా కూడా చనిపోయినట్లు 108 సిబ్బంది వెల్లడించారు. ఖాసింసైదా భార్య హుస్సేన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టీవీఎస్ మరమ్మతులకు వెళుతుండగా..: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఖాసింసైదా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, అయిదుగురు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. మీరావలికి భార్య, ఇద్దరు మగ, ఇద్దరు ఆడ పిల్లలున్నారు. టీవీఎస్ మోపెడ్ మరమ్మతులు చేయించుకునేందుకు అద్దంకి వైపు ప్రయాణిస్తుండగా ప్రమాదం సంభవించింది. దీంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

కాలువలో పడి యువకుడి మృతి

మరొకరిని రక్షించిన జాలర్లు



వెంకటసాయి (పాత చిత్రం)

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: మండల పరిధిలో అడవిపల్లెపాలెం గ్రామ పంచాయతీ కృపానగర్ సమీపంలో ఈపూరుపాలెం కాలువ దాటుతూ ఇద్దరు కార్మికులు ప్రమాదవశాత్తు నీట మునగడంతో ఒకరు మృతిచెందగా మరొకరిని స్థానిక జాలర్లు కాపాడి క్షేమంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. స్థానికుల కథనం మేరకు చీరాల పట్టణానికి చెందిన ముత్తుకూరి వెంకటసాయి, వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నారు. కేబుల్ వైర్లు లాగి కనెక్షన్లు ఇచ్చే పనులు చేస్తుంటారు. ఇటీవల ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ సమీపంలో కేబుల్‌వైర్లు తెగిపడ్డాయి. ఇలాంటి సమస్యలు తలెత్తినప్పుడు స్థానిక జాలర్లకు నగదు చెల్లించి పడవలో వెళ్లి పనులు చేసేవారు. ఇదే తరహాలో కేబుల్ వైర్లు తీసుకెళ్లేందుకు వచ్చి కాలువలో ఒరవడి తక్కువగా ఉందని ఇద్దరూ కాలువ దాటుతుండగా మధ్యలో ఉన్న పెద్ద గుంతలో పడ్డారు. కాలువ నీటిలో మునిగిపోతూ రక్షించమంటూ కేకలు వేశారు. ఇది గమనించి స్థానిక జాలర్లు హుటాహుటిన పడవలో వెళ్లి కాలువ నీటిలో కొట్టుకుపోతున్న శ్రీనివాసరెడ్డిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. మరో కార్మికుడు సాయి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బాపట్ల గ్రామీణ సీఐ కె.గంగాధర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కాలువలో పడవల ద్వారా గాలించారు. రాత్రి పొద్దుపోయాక సాయి మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం కోసం బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, రిటైల్ ధర - 150, చికెన్ విత్‌స్కిన్ - 218, చికెన్ స్కిన్‌లెస్ - 248.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 133, 142, 153 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

సనాతన ధర్మమే శాశ్వతం

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: సనాతన ధర్మం నిత్యమూ..శాశ్వతమైనదని ప్రతి ఒక్కరూ ఈ ధర్మానికి కట్టుబడి ఉంటే సమాజం శాంతి సౌభాగ్యాలతో వెల్లివిరుస్తుందని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా బాలవికాస్ ప్రముఖ్ యల్లాప్రగడ సీతాపతి అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ కన్వీనర్లకు చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణమండపంలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభకు జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. వక్తలు ప్రసంగిస్తూ హిందూ ధర్మ ప్రచారంలో గ్రామ కన్వీనర్ల పాత్ర ఎంతో కీలకమైందని..గ్రామాల్లో సామూహిక భజన కార్యక్రమాలు... సత్సంగాలు జరిగేలా చూడాలన్నారు. జ్ఞాన సముపార్జనకు గీతాపారాయణానికి మించిన సాధన లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, విస్సంశెట్టి శ్రీనివాసరావు, పరిశా రాంబాబు, ఆలపాటి సుధారాణి, రేపల్లె డివిజన్ ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, రేపల్లె, నగరం, భట్టిప్రోలు, చెరుకుపల్లి మండలాలకు చెందిన గ్రామ కన్వీనర్లు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఐలవరం జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తుమ్మా శ్రీనివాసరెడ్డి ఎంపికైనట్లు గురువారం తెలిపారు. ఆయనను పలు పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఇంటూరు (అమృతలూరు), న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తతతో మెలగాలని జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ అన్నారు. ఇంటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలుషిత ఆహారం, నీటితో వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సిబ్బందికి సూచించారు. పరిశుభ్రమైన తాగునీటి కోసం సకాలంలో నీటి నాణ్యతను పరిశీలించాలన్నారు. డయేరియా వ్యాప్తి చెందకుండా క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దస్త్రాలను పరిశీలించారు. వైద్యాధికారి కిరణ్‌కుమార్, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

జిల్లాలో 192 రేషన్ దుకాణాలకు డీలర్ల నియామకం

నోటిఫికేషన్లు జారీ చేస్తున్న ఆర్డీవోలు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో 192 రేషన్ దుకాణాలకు డీలర్ల నియామకానికి రంగం సిద్ధమైంది. రెవెన్యూ డివిజన్ల వారీగా ఖాళీల భర్తీకి ఆర్డీవోలు నోటిఫికేషన్లు జారీ చేస్తున్నారు. రేషన్ డీలర్ పోస్టుకు విద్యార్హత ఇంటర్‌గా నిర్ణయించారు. రాత, మౌఖిక పరీక్షల అనంతరం డీలర్లను ఎంపిక చేయనున్నారు. జిల్లాలో 182 రేషన్ దుకాణాలకు డీలర్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పౌరసరఫరాల అధికారులు గుర్తించారు. పౌరసరఫరాల కమిషనర్ కార్యాలయం నుంచి జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో కొత్తగా పది రేషన్ దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. 800 తెల్లరేషన్ కార్డులు పైగా కలిగిన రేషన్ దుకాణాలు పది ఉన్నట్లు గుర్తించారు. వీటిని విభజించి కొత్తగా పదింటిని ఏర్పాటు చేస్తున్నారు. కొత్త డీలర్ల నియామకానికి రిజర్వేషన్ల వారీగా రోస్టర్ పాయింట్లు రూపొందించారు. రేషన్ డీలర్ల నియామక ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేయనున్నారు. డివిజన్ల వారీగా బాపట్ల 29, రేపల్లె 42, చీరాలలో 125 రేషన్ దుకాణాల డీలర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2010-11లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టులు భర్తీ చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో భర్తీ జరగకపోవటంతో డీలర్ల పోస్టులు ఎక్కువ సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. డీలర్లు మరణించటం, అనారోగ్య సమస్యలతో తప్పుకోవటం, రాజీనామా చేయటం వల్ల వందల సంఖ్యలో ఖాళీలు ఏర్పడగా గత వైకాపా ప్రభుత్వం భర్తీ చేయలేదు. వైకాపా నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులకు తాత్కాలికంగా రేషన్ దుకాణాలు కట్టబెట్టారు. కొన్ని దుకాణాలను పొదుపు సంఘాల మహిళలు తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలు, ఎక్కువ సంఖ్యలో కార్డులు ఉన్న దుకాణాల విభజనపై దృష్టిసారించింది. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న రేషన్ల డీలర్ల నియామక ప్రక్రియకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రేషన్ డీలర్ల ఖాళీల భర్తీకి ఇప్పటికే ఆయా ఆర్డీవోలు నోటిఫికేషన్లు జారీ చేయటం ప్రారంభించారు.

లారీ ఢీకొని పెయింటర్ దుర్మరణం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రోడ్డుపై నడిచి వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం భట్టిప్రోలు మండలం పల్లెకోనకు చెందిన గుర్రం శ్రీనివాసరావు (45) పెద్ద కూరగాయల మార్కెట్ వైపు నుంచి ఓల్డ్‌టౌన్ వైపు రోడ్డుపై నడిచి వెళ్తుండగా పెద్ద మసీదు సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పెయింటింగ్ పని కోసం వచ్చి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడని బంధువులు తెలిపారు. మృతుడి తమ్ముడు వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ గురువారం తెలిపారు.

స్వర్ణ అమ్మవారి ఆలయంలో హుండీ పగలగొట్టి చోరీ

కారంచేడు (మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని స్వర్ణ గ్రామంలోని స్వర్ణమ్మ ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు దోచుకెళ్లిన సంఘటన వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు..అమ్మవారి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడినట్లు భావిస్తున్నారు. గురువారం ఉదయం పూజారి ఆలయానికి రాగా హుండీ తాళాలు పగలగొట్టి అందులోని సుమారు రూ.1.70 లక్షల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఘటనపై కారంచేడు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకటరావు చోరీపై పరిశీలన చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని ఆయన తెలిపారు.

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

పార్కును సుందరీకరిస్తాం

ఈనాడు కథనానికి స్పందన

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో బ్యాంకు కాలనీ పార్కును సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి అన్నారు. పట్టణంలోని వార్డుల్లో సమస్యలు దానివల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'సమస్యల వలయంలో కాలనీలు' శీర్షికన ఈనెల 24న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. బ్యాంకు కాలనీ పార్కును ఆయన సందర్శించారు. పార్కులో మొక్కలు నాటి కొత్త బల్లలు ఏర్పాటు చేసి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రామకృష్ణ సేవా సమితి వద్ద పల్లంగా ఉండి, నీరు నిలిచే రోడ్డును పరిశీలించారు. నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

శాశ్వత ఇళ్లు లేని వారిని గుర్తించేందుకు సర్వే

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో శాశ్వత గృహాలు లేని వారిని గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ మహబూబ్ సుబానీ తెలిపారు. రానున్న అయిదేళ్లలో కేంద్రం 2 కోట్ల ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సాయం అందించటానికి ఆమోదం తెలిపిందన్నారు. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇళ్లులేని వారిని గుర్తించేందుకు గ్రామాల్లో ఆవాస్ సర్వేయర్లుగా ఇంజినీరింగ్ సహాయకులకు బాధ్యతలు ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 30లోపు సర్వే పూర్తి చేయాల్సి ఉంటుందని, అనంతరం వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.1.80లక్షలు మంజూరు చేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? మండలంలో సంగుపాలెం పంచాయతీ పరిధి కుర్వపాలెం ప్రధాన వీధిలో విద్యుత్తు బల్బులు వెలగకపోవడంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా కుర్వపాలెం నుంచి బావాజీపాలెం వెళ్లే దారి ముళ్ల పొదలతో నిండింది. రాత్రిళ్లు వీధి దీపాలు వెలగక పోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. **- స్థానికులు, సంగుపాలెం**

✔ బల్బులు తీసుకొచ్చాం. ఎక్కడెక్కడ వీధి దీపాలు వెలగడం లేదో గుర్తించి కొత్తవి ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. **- సుజాత, గ్రామ కార్యదర్శి, సంగుపాలెం**

– న్యూస్‌టుడే, సంగుపాలెం(పిట్టలవానిపాలెం)

? నిజాంపట్నం పంచాయతీలో రహదారుల పక్కనే చెత్తా చెదారం పారబోస్తున్నారు. ముఖ్యంగా పాలరేవు, దర్వేష్ పాలెం మార్గాల్లో దుర్వాసన భరించలేకున్నాం. పంచాయతీ అధికారులు స్పందించి ఆయా మార్గాల్లో చెత్త తొలగింపు చర్యలు చేపట్టాలి. **- స్థానికుడు, నిజాంపట్నం**

✔ క్షేత్రస్థాయి పరిశీలన చేసి సిబ్బందిని ఏర్పాటు చేసి చెత్తను తొలగిస్తాం. ఇకపై ఆయా ప్రాంతాల్లో చెత్త పడేయవద్దని సూచనలు చేస్తా. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **- శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, నిజాంపట్నం**

– న్యూస్‌టుడే, నిజాంపట్నం

? మండలంలో జంపని నుంచి పోతుమర్రు వెళ్లే రహదారిలో కోటి కాల్వ వద్ద రోడ్డు పక్కన చెత్త వేస్తున్నారు. వ్యర్థాలు రోడ్డుపైకి చేరుతున్నాయి. **- స్థానికుడు, జంపని**

✔ వెంటనే పంచాయతీ సిబ్బందిని పంపి చెత్తను తొలగిస్తాం. **- రెహ్మాన్, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, వేమూరు

వీధి దీపం ఏర్పాటు

స్పందనకు వందనం

భట్టిప్రోలు : పంచాయతీ పరిధిలోని ఓబిక్ మాల్‌లో వీధిలైటు వెలగడం లేదు. దీనివల్ల ఆ మార్గంలో రాకపోకలు సాగించే విద్యార్థుల ఇబ్బందులను 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఈనెల 18న 'ఈనాడు' అధికారుల దృష్టికి తెచ్చింది. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు స్పందించి ఆ స్తంభానికి కొత్త లైటు ఏర్పాటు చేయించారు. చీకటిగా ప్రాంతంలో వెలుగు వచ్చిందని, విద్యార్థులకు ఇబ్బంది ఉండదని స్థానికులు ఆనందం వెలిబుచ్చారు.

ఎవరికీ పట్టని పుస్తకాలయం

- శిథిలావస్థలో భవనం
- పాడవుతున్న పుస్తకాలు

కనగాల, గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే

మండలంలో కనగాలలోని విజ్ఞాన భాండాగారం అధికారుల నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరింది. కనగాల శాఖా గ్రంథాలయం కాలక్రమేణా రీడింగ్‌రూంగా మార్పుచెందింది. అది కాస్తా నేడు మూలన పడింది. భవనం పల్లంగా ఉండడంతో వర్షపు నీరు భవనంలోకి చేరి పుస్తకాలు, బీరువాలు, బల్లలు తడిసి పాడవుతున్నాయి. ఏళ్లుగా ఇలా రీడింగ్ రూంలో పుస్తకాలు పనికిరాకుండా పోతున్నాయని, వాటిని భద్రపరచాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు.


అధ్వాన స్థితిలో కనగాల గ్రంథాలయం

చెరిగిపోతున్న జాషువా గుర్తులు

తీర ప్రాంతంలోని కనగాలలో ఈ గ్రంథాలయాన్ని ప్రఖ్యాత కవి గుర్రం జాషువా ప్రారంభించారు. ఆ సమయంలో ఈ విజ్ఞాన భాండాగారంలో దాదాపు పది వేల పుస్తకాలుండేవి. కొన్నాళ్లకు గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో జవహర్ రోజ్‌గార్ పథకంలో భాగంగా 1991-92లో మరో చిన్న భవనాన్ని నాటి పాలకులు ఏర్పాటు చేశారు. భవనం పల్లంగా మారడంతో వర్షపు నీరు లోపలకు వచ్చి గ్రంథాలయాన్ని మూసివేశారు. అప్పటి వరకు పనిచేసిన గ్రంథాలయాధికారి ఉద్యోగ విరమణ చేయడం, ఈ పుస్తక కేంద్రం శాఖ గ్రంథాలయమా..పంచాయతీ రీడింగ్ రూమా..? అనే సందేహాలతో దీన్ని గత పుష్కర కాలంగా ఎవరూ పట్టించుకోలేదు.


పాడవుతున్న బీరువాలు, పుస్తకాలు

పుస్తకాలను జాగ్రత్త చేయిస్తాం

కనగాల గ్రంథాలయాన్ని జాషువా వంటి పెద్దలు ప్రారంభించారంటే మండల వాసులు ఎంతో అదృష్టవంతులు. వారి జ్ఞాపకాలు చెరిగిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పుస్తకాలను గ్రామంలో లేదా చెరుకుపల్లిలో జాగ్రత్త చేసేందుకు నా వంతు కృషి చేస్తాను. జిల్లా గ్రంథాలయాధికారి దృష్టికి ఈ విషయం తీసుకెళతాను.

– షేక్ మహబూబ్ సుభానీ, ఎంపీడీవో, చెరుకుపల్లి

కళ తప్పిన ఉద్యానవనం

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో వివేకానందకాలనీ పార్కు భారీ వర్షాలకు అధ్వానంగా తయారైంది. పార్కులో నీరు నిలిచి ఉదయం, సాయంత్రం నడక సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు. రోజుల తరబడి నీటి నిల్వతో దుర్వాసన వస్తోంది. కాలనీ వాసులు సేదతీరటానికి ఏర్పాటు చేసిన గుడారం పైకప్పు పూర్తిగా దెబ్బతింది. పార్కులో నిలిచిన వాన నీటిని బయటకు పంపించి గుడారం పైకప్పు వేసి మెరుగైన వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను పురపాలక ఏఈ ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.


పార్కులో నిలిచిన నీరు


పైకప్పు లేని గుడారం

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

చుండూరు, వేమూరు, రేపల్లె అర్బన్, అమృతలూరు, నగరం, న్యూస్‌టుడే: రైతులు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. భూ రీ-సర్వేపై గురువారం చుండూరు మండలం పెనుగుదురుపాడులో నిర్వహించిన గ్రామ సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీ-సర్వేలో జరిగిన లోపాలపై అర్జీలను స్వీకరించారు. ఇక్కడ అడంగల్‌లో పేరు మార్పునకు ఒకటి, భూమి కొలతలపై రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ మల్లికార్జునరావు చెప్పారు. వేమూరు మండలం బలిజేపల్లిలో నిర్వహించిన గ్రామ సభలో భూ సమస్యలపై రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ సుశీల తెలిపారు. రేపల్లె మండలం పరిశపాడులో పొలం విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు సరిచేయాలని 6, పేర్లలో తప్పులను సవరించాలని 2 అర్జీలు అందాయని తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రం నగరం సచివాలయంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 40 అర్జీలు అందినట్లు తహసీల్దార్ నాంచారయ్య తెలిపారు. అమృతలూరు మండలం బోడపాడులో రైతుల నుంచి 16 వినతులు అందినట్లు తహసీల్దారు నెహ్రూబాబు తెలిపారు. ఆయా తహసీల్దార్లు మాట్లాడుతూ రైతుల సమస్యలను 15రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.


వేమూరు: రైతుకు ధ్రువపత్రం ఇస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

ప్రతిభతో మెరిశారు

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని అక్షర విద్యా భవన్, శ్రీచైతన్య-2 టెక్నో పాఠశాలల్లో ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు గురువారం జరిగాయి. పోటీల్లో భాగంగా ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు 'ఇంటర్నెట్ వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమ ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అక్షర విద్యాభవన్ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి విద్యార్థులు జీబీ అమృతదుర్గ, డి.భవ్యశ్రీ, కె.సాయిచరణ్‌రెడ్డి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ వి.శ్రీనివాసరాజు, ప్రిన్సిపల్ పి.రత్నమాల బహుమతులు ప్రదానం చేశారు. శ్రీచైతన్య-2 పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో రాణించిన విద్యార్థులు ఎం.జస్మిత ప్రథమ, పి.అఫ్రీన్ మద్నిఖాన్ ద్వితీయ, ఐ.హన్సుజ తృతీయ స్థానం సాధించారు. విజేతలకు పాఠశాల ఇన్‌ఛార్జి కె.వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయుడు డి.ప్రశాంత్ కుమార్ బహుమతులు అందజేశారు.


అక్షర విద్యా భవన్ పాఠశాలలో విజేతలు


శ్రీచైతన్య-2 పాఠశాలలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

మహిళలకు ఆర్థిక చేయూత

కర్లపాలెం, న్యూస్‌టుడే: ప్రతి మహిళకు ఆర్థిక చేయూతనిచ్చి లక్షాధికారిని చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ముద్ర రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారని, ఇది మహిళల ఆర్థిక స్వావలంబనకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



అమృతలూరు, న్యూస్‌టుడే: వీఆర్‌కే ట్రస్ట్ ఛైర్మన్ వేములపల్లి రవికిరణ్ పుట్టినరోజు సందర్భంగా అమృతలూరులో పేదలకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ గొట్టిపాటి పూర్ణకుమారి, భానుగంగాధర్ దంపతుల సహకారంతో 220 మందికి దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో బాలాజీ, సుధీర్, రామేశం, బాబూరావు, రాంబాబు, చంద్రం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముప్పలనేని ఆశయ సాధనకు కృషి

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల అభివృద్ధికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా, విద్యా ప్రదాతగా ముప్పలనేని శేషగిరిరావు ఎనలేని సేవలందించారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముప్పలనేని శేషగిరిరావు 91వ జయంతిని ముప్పలనేని ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పడమర బాపట్లలోని స్మారక కేంద్రం వద్ద ముప్పలనేని విగ్రహానికి ఎమ్మెల్యే వేగేశన, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, నేతలు, కుటుంబసభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ రాజకీయాల్లో నీతి, నిజాయితీలతో పని చేసిన ఆదర్శ నేత శేషగిరిరావు అన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడిగా ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, పలు విద్యా సంస్థలను స్థాపించి వేల మందికి ఉత్తమ ప్రమాణాలతో విద్య నందించి, ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ముప్పలనేని ఆశయాల సాధనకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, భాజపా జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మానం విజేత, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, తెదేపా పట్టణాధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, పురపాలక మాజీ ఇన్‌ఛార్జి ఛైర్మన్ నరాలశెట్టి ప్రకాష్, యువ నేత ముప్పలనేని సుమంత్, కాకతీయ సేవ సమాఖ్య అధ్యక్షుడు ఆచంట రమేష్‌బాబు, బీఈఎస్ ఉపాధ్యక్షుడు గెల్లి దిలీప్‌కుమార్, మాజీ ఎంపీపీ దాసరి యోహాను తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే శేషగిరిరావు విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే నరేంద్రవర్మ, బీఈఎస్ ప్రతినిధులు

గుంత తవ్వి వదిలేశారు

చుండూరు, న్యూస్‌టుడే: మండలంలోని మోదుకూరులో ప్రధాన రహదారి పక్కన రక్షిత నీటిని సరఫరా చేసే పైపులైన్‌కు లీకులు ఏర్పడ్డాయి. మరమ్మతుల్లో భాగంగా అక్కడ గుంత తీసి దాన్ని పూడ్చకుండా వదిలేశారు. రోడ్డుపై వెళ్లే వారు పొరపాటున పక్కకు వెళితే గుంతలో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సమస్య అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు చొరవతీసుకుని గుంత పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్‌డీ కుమారస్వామిని సంప్రదించగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు.



ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

కర్లపాలెం: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు ఆయన హామీ ఇచ్చారు. తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగా శివసాంబిరెడ్డి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు నక్కల వెంకటస్వామి, మండలాధ్యక్షుడు భూపతిరావు పాల్గొన్నారు.

పోలీసు విధులపై అవగాహన

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : చట్టాల గురించి ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని చందోలు ఎస్సై ఆర్.ఎస్.శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని అల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలు, పోలీసుల విధులపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పద్మారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు తీరం క్రీడాకారులు

నిజాంపట్నం, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు ఈనెల 26, 27 తేదీల్లో తెనాలిలో జరగనున్నాయి. ఈ పోటీలకు నిజాంపట్నం నుంచి క్రీడాకారులు పాల్గొననున్నట్లు అంతర్జాతీయ కోచ్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. వీరంతా నిజాంపట్నంలో శిక్షణ తీసుకుంటున్నారు.

వివరాలు నమోదు చేసుకోండి

నిజాంపట్నం: మత్స్యరంగంతో అనుసంధానమైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్ఎఫ్‌డీపీ నేషనల్ డిజిటల్ ప్లాట్‌ఫాంలో పేరు, వివరాలు నమోదు చేసుకోవాలని మత్స్య అభివృద్ధి అధికారి సాయి సందీప్ తెలిపారు. మత్స్యశాఖ సిబ్బంది ఉచితంగా చేస్తారన్నారు. మత్స్యకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వ్యక్తి అనుమానాస్పద మృతిపై దర్యాప్తునకు వినతి

బాపట్ల, న్యూస్‌టుడే: చీరాల మండలం కీర్తివారిపాలెం పెట్రోలు బంకు సమీపంలో ఈ నెల 13న అనుమానాస్పద రీతిలో మృతి చెందిన పాపాయిపాలేనికి చెందిన పులి శ్రీనివాసరావు కేసును పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీని చీరాల నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త కరణం వెంకటేష్ కోరారు. మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీని వెంకటేష్ గురువారం కలిశారు. ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరావు మరణంపై కుటుంబసభ్యులకు చాలా అనుమానాలు ఉన్నాయన్నారు. ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించాలని కోరుతూ ఎస్పీకి మృతుడి అక్క శివకుమారి, కుమారుడు కిశోర్ వినతిపత్రం అందజేశారు. ఎస్పీ స్పందిస్తూ కేసుపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయించి మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారని కరణం వెంకటేష్ తెలిపారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దని ఫిర్యాదు

బాపట్ల, న్యూస్‌టుడే: కర్లపాలెంలో ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుతో మహిళలు, విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆబ్కారీ శాఖ సీఐ గీతికకు ఆర్యవైశ్య సంఘం నేత లలితబాబు గురువారం ఫిర్యాదు చేశారు. బాపట్ల ఆబ్కారీ స్టేషన్‌కు గురువారం వచ్చిన ఆయన సీఐను కలిసి నివాస గృహాలకు దూరంగా దుకాణాన్ని తరలించాలని కోరారు.

వేగ నియంత్రికల ఏర్పాటుకు స్థల పరిశీలన

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక విలియంబూత్ కళాశాల నుంచి దరివాద కొత్తపాలెం వెళ్లే దారిలో వేగ నియంత్రికల ఏర్పాటుపై మండల, పట్టణ పోలీసులతో పాటు ఎన్‌హెచ్ 216(ఎ) అధికారులు స్థల పరిశీలన చేశారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల వద్ద విద్యార్థులు రోడ్డు దాటే ప్రాంతాలు, కంకటపాలెం రైల్వే గేటు వైపు వెళ్లే మలుపు వద్ద సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుపై పోలీస్, రోడ్డు, రవాణాశాఖ, హైవే అధికారులు చర్చించారు. వేగ నియంత్రికలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని గ్రామీణ సీఐ కె.గంగాధర్ సూచించారు. విద్యార్థులు కళాశాల వద్ద రోడ్డుపై ద్విచకవాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, కళాశాలలో నిలుపుదల చేసేలా చూడాలని యాజమాన్యాన్ని కోరామన్నారు. పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీ, హైవే అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం

చుండూరు, న్యూస్‌టుడే: చుండూరు మండలం పెనుగుదురుపాడుకు చెందిన జి.చిన కోటేశ్వరరావు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల చికిత్స చేయించుకున్నారు. అలాగే వలివేరుకు చెందిన చిన్నారి బి.లావణ్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు వైద్యం చేయించారు. వారు ఎమ్మెల్యే ఆనందబాబు ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా కోటేశ్వరరావుకు రూ. 95వేలు, లావణ్యకు రూ.69వేల సాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సీఎంఆర్ఎఫ్‌కు రూ.40వేల విరాళం

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : సీఎం సహాయ నిధికి స్థానిక నరాలశెట్టివారిపాలెంలో వేంచేసియున్న శ్రీఅష్టలక్ష్మి దేవాలయం తరఫున రూ.40వేల చెక్కును విరాళంగా గురువారం అందచేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు దేవాలయ అధ్యక్షుడు నరాలశెట్టి ప్రకాష్ అందించారు. ప్రజలను ఆదుకునేందుకు ముందుకు రావటంపై ఎమ్మెల్యే వారిని అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీ


నిజాంపట్నం: గురుకుల పాఠశాలలో నిర్వహించిన పోటీలో విద్యార్థులు

భట్టిప్రోలు, నిజాంపట్నం, న్యూస్‌టుడే : పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు అధికారి తుషార్ డూడీ ఆదేశాల మేరకు భట్టిప్రోలు టీఎంరావు ఉన్నత పాఠశాల, నిజాంపట్నం బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు 'సైబర్ నేరాల నియంత్రణలో యువత పాత్ర' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వం పోటీలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులంతా పోటీలో పాల్గొన్నారు. ఎస్సైలు శివయ్య, కందుల తిరుపతిరావు మాట్లాడుతూ విద్యార్థులు నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎవరైన మోసపోయినట్లు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయించాలని సూచించారు. ప్రతిభ చూపిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం తయారు చేయండి

నగరం, న్యూస్‌టుడే: మెనూ ప్రకారం, తాజా కూరలతో విద్యార్థులకు భోజనం అందించాలని ఎంఈవో పులి లాజర్ అన్నారు. మండల పరిధిలోని మంత్రిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలసి గురువారం మధ్యాహ్న భోజనం చేశారు. ముందుగా పాఠశాల పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎన్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించినా రాకపోకలకు కష్టాలేనా?


రైల్వే గేటు పడటంతో నిలిచిన వాహనాలు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : జాతీయ రహదారి మార్గంలో మండలంలో సూరేపల్లి రైల్వే గేటు వద్ద వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. ఈ రైల్వే గేటు వద్ద జాతీయ రహదారి మార్గంలో పైవంతెన నిర్మించారు. ఈ పనులు పూర్తయ్యాయి. అయినా అధికారులు వంతెనను ప్రారంభించకపోవడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తుతోంది. రైల్వే సిబ్బంది రైలు వచ్చే ముందు, వెళ్లిన తర్వాత అరగంట సేపు గేటు మూసి ఉంచడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు గేటుకు ఇరువైపులా నిలుస్తున్నాయి. వంతెన నిర్మించినా ప్రారంభించకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్య ఉండటంతో ఇటీవల తహసీల్దారు శ్రీనివాసరావు వంతెన వద్దకు వెళ్లి పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి వంతెన పూర్తయిందని నివేదికలు ఇస్తే కలెక్టరుకు పంపుతామని తెలిపారు. అయినా జాతీయ రహదారి శాఖ అధికారులు వంతెన పట్ల శ్రద్ధ తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులైనా స్పందించి వంతెనను ప్రారంభించాలని కోరుతున్నారు.


నిర్మాణం పూర్తయిన వంతెన

చీరాల

•చీరాల •అద్దంకి •పర్చూరు

వివాదాస్పద పంట కాలువ పరిశీలన

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే : చీరాల మండలం ఈపూరుపాలెం పరిధి వాద పొలాల్లో వివాదాస్పద పంట కాలువను గురువారం చీరాల ఆర్డీవో అఖిల పరిశీలించారు. కాలువలో చప్టా నిర్మాణం కోసం ఇనుప చువ్వలు ఏర్పాటు చేసి తూములు మూసివేసిన రైతును పిలిపించి మాట్లాడారు. కాలువ పూర్తిగా తన భూమిలో ఉండటం వల్ల కాలువలో చప్టా ఏర్పాటు చేస్తున్నట్లు రైతు వాదించారు. దశాబ్దాలుగా తమకు ఈ కాలువ ద్వారా సాగునీరు అందుతుందని, ఇప్పుడు మూసివేస్తే తమ భూములన్నీ బీడులుగా మారతాయని కింద ఉన్న రైతులు పేర్కొన్నారు. దీంతో రైతుల వద్ద ఉన్న పత్రాలను మరోసారి పరిశీలించాలని ఆర్డీవో తహసీల్దారు గోపీకృష్ణను ఆదేశించారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ ఎంపికలు

కొత్తపేట(వేటపాలెం), న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో బాల బాలికల బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు గురువారం స్థానిక రావి జయలక్ష్మి, సుబ్బారాయుడు ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన కారుణ్య సేవా సమితి కార్యదర్శి గోవర్ధన్ మాస్టారు మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యత పెంపొందించేందుకు ప్రతి క్రీడాకారుడు నిత్య సాధన చేయాలన్నారు. పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన బాల బాలికలు ఉమ్మడి జిల్లా తరఫున రాష్ట్రస్థాయికి ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఎం. సీతాదేవి, కె.రాణి, శ్రీనివాసరావు, శిక్షకులు ప్రసాదు, వ్యాయామోపాధ్యాయులు పోటీలను పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలోని సిమెంట్ రహదారి అంచుల్లో ఓ వైపు పక్కా మురుగు కాలువ నిర్మాణం చేపట్టలేదు. దీంతో నివాస గృహాల్లోని వాడిన నీరు రహదారి పైకి చేరి బురద మయంగా మారుతోంది. విద్యార్థులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

-విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు, ఏల్చూరు

✔ తక్షణం పరిశీలించి పక్కా మురుగు కాలువల నిర్మాణం చేపడతాం.- **జ్యోతిర్మయి, మండల పరిషత్తు అధికారి, సంతమాగులూరు**

-న్యూస్‌టుడే, ఏల్చూరు (సంతమాగులూరు),

? సర్వోదయ కాలనీ నుంచి కొత్తకాలు రైల్వే బ్రిడ్జి వద్ద మొన్నటి వరకు పశువుల మాంసం విక్రయించేవారు. వారు రాను రాను గృహాల మధ్య వీటిని వధించి విక్రయిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది

-సుబ్బారావు, స్థానికుడు

✔ దీనిపై ఫిర్యాదు అందింది. ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం **-మోహన రంగారావు, పంచాయతీ కార్యదర్శి, వేటపాలెం -న్యూస్‌టుడే,వేటపాలెం,**

? స్థానిక పాలేటి నగర్ దండుబాట వద్ద పట్టణంలోని చెత్తా చెదారం తెచ్చి వేస్తున్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం **-వెంకటరావు, స్థానికుడు**

✔ ఆప్రాంతాన్ని పరిశీలించి చెత్త వేయకుండా చూస్తాం

-ప్రవీణ్, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ -న్యూస్‌టుడే, చీరాల

26 నుంచి మాలధారులకు అన్నప్రసాద వితరణ

మార్టూరు, న్యూస్‌టుడే: శ్రీరుక్మాబాయి సమేత పాండురంగ, ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద 26 నుంచి మాలధారులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ సకల ఆంజనేయులు గురువారం తెలిపారు. అయ్యప్పలు, శివ, భవాని స్వాములు ప్రతిరోజు మధ్యాహ్నం నిర్వహించే చద్ది కార్యక్రమానికి హాజరై అన్నదానంలో పాల్గొనవచ్చని తెలిపారు. దాత సందు పూర్ణచంద్రరావు ఆర్థిక సహకారంతో డిసెంబర్ 6 వరకు అన్నదానం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

పోలీసు అమరవీరులపై అవగాహన

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: శాంతి భద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసులపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై వెంకటరావు అన్నారు. గురువారం మండలంలోని స్వర్ణ జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహించారు.

చినగంజాం: పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, డిబెట్ ప్రతిభా పోటీలు నిర్వహించారు. 8, 9, 10వ తరగతులకు చెందిన 50 విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని హెడ్‌కానిస్టేబుల్ ప్రకాష్ తెలిపారు.

దేవాంగపురి.. సమస్యల భేరి

న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం

మండలంలో మేజర్ పంచాయతీలలో ఒకటైన దేవాంగపురిలో సమస్యలు భేరి మోగిస్తున్నాయి. 16 వార్డుల్లో 20 వేల జనాభా పైగా ఉన్నారు. గ్రామంలో 3660 అసెస్‌మెంట్లు ద్వారా దాదాపు రూ. 46 లక్షల ఆదాయం సమకూరుతున్నా.. అంతర్గత రహదారులు బాగుపడటం లేదు. ప్రజా ప్రతినిధులు ఇకనైనా తమ కష్టాలను ఒక కొలిక్కి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నిరుపయోగంగా రూ.40 లక్షల విలువైన సచివాలయ భవనం

ఇవీ వెతలు

❖ మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో శివాలయం మందు, పాత చీరాల గేటు కూడలిలో వారం రోజుల వరకు వర్షం నీరు, బురదతో స్థానికులు, పాదచారుల, వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. కుందేరు వరకు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని గత ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీ నీటి మూటగా మిగిలింది.

❖ అంతర్గత రహదారులు కొన్ని చోట్ల అధ్వానంగా మారాయి. అక్కాయపాలెం రహదారి మొత్తం గోతులమయంగా ఉంది. కేపాల్ కాలనీ, పంచాయతీ వెనుక, పక్క వీధుల్లో ఇదే పరిస్థితి. ఇటీవల పల్లె పండుగలో భాగంగా గ్రామంలో రూ. 47.50 లక్షలతో తొమ్మిది సీసీ రహదారులు అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు రూపొందించారు. ఈ పనులు సత్వరం పూర్తి అయితే కాని సమస్య తీరదు.

❖ కేపాల్ కాలనీకి వెళ్లే దారిలో శ్మశాన వాటిక పక్కనే పూర్వ సాంఘిక సంక్షేమ వసతి గృహ స్థలంలో రూ. 40 లక్షలతో సచివాలయం- 2 నిర్మించారు. కానీ అది ఇంకా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ఉన్నత పాఠశాల పరిసరాలలోని ఎనిమిది వార్డుల ప్రజల సచివాలయ సేవలు భారంగా ఉన్నాయి. ఇదే స్థలంలో రూ. 25 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాలు కూడా నిరుపయోగంగా ఉన్నాయి.

❖ ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రస్తుతం ఓపీ రోజుకు 50 నుంచి 60 వరకు పెరిగిందని గ్రామ పెద్దలు అంటున్నారు. రోగులకు మరిన్ని సేవలు అందించడానికి విజిటింగ్ డాక్టర్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

❖ పాత చీరాల గేటు సమీపంలోని శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలు, చెల్ల చెట్లతో నిండి ఉండటంతో కర్మకాండలకు ఇబ్బందిగా మారింది. చుట్టు ప్రహరీ లేకపోవడంతో అన్యాక్రాంతం అవుతూ వస్తోంది. ఇటీవల గ్రామస్థులు సమస్యలను ఎమ్మెల్యే కొండయ్య దృష్టికి తీసుకెళ్లగా ఆయన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు స్థానిక నాయకులు పేర్కొంటున్నారు.

జాతీయస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

మేదరమెట్ల, అద్దంకి, న్యూస్‌టుడే: మాంద్రాస్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్‌లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలో మేదరమెట్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థికి ప్రథమస్థానం లభించింది. పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న పీఎల్ వెంకట కార్తీక అనే విద్యార్థిని ప్రథమస్థానంలో నిలిచింది. విద్యార్థినికి రూ. 2వేల నగదు, ప్రశసా పత్రాన్ని పాఠశాల హెచ్ఎం అంజయ్య అందించారు. అద్దంకి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్‌కే.నఫియాకు సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలో ద్వితీయస్థానం సాధించింది. ఆమెకు రూ. 1000 నగదు, ప్రశంసాపత్రాన్ని హెచ్ఎం శ్రీనివాసరావు అందించారు.

రైతు సంఘాలతో చర్చించాలి

ఇంకొల్లు న్యూస్‌టుడే: రైతు సంఘాలతో జిల్లా స్థాయి చర్యలు జరిగాకే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా రైతుసంఘ ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఇంకొల్లులో ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న రెవెన్యూ అధికారులే ప్రస్తుతం కొన్ని చోట్ల పనిచేస్తున్నారు. వారు చేసిన తప్పులు తిరిగి పునరావృతం అయ్యే ప్రమాదం ఉన్న నేపథ్యంలో తప్పు చేసిన అధికారులను బదిలీచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

తైక్వాండో పోటీల్లో సెయింట్ ఆన్స్ సత్తా

వేటపాలెం, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో సెయింటాన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మూడు రోజుల నుంచి తైక్వాండో ఎంపికలు, ఇంటర్ కళాశాలల టోర్నమెంట్‌లు జరుగుతున్నాయి. వీటిలో సెయింటాన్స్‌కు చెందిన క్రీడాకారులు తైక్వాండోలో ఆరుగురికి స్వర్ణం, ఒకరికి వెండి పతకాలు సాధించినట్లు ఆ కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన అభినందన సభలో క్రీడాకారులను యాజమాన్యంతో పాటు ప్రధానాచార్యుడు డాక్టరు కె. జగదీష్‌బాబు, పీడీ అన్నం శ్రీనివాసరావు, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

పొగాకు వినియోగించ కూడదు

మైలవరం(అద్దంకి) : ప్రాణాంతకమైన పొగాకు వినియోగానికి స్వస్తి పలకాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మైలవరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. నాగేశ్వరరావు అన్నారు. ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు పొగాకు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

రీ-సర్వేతో సమస్యలకు పరిష్కారం

పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, వేటపాలెం,టి.కొప్పెరపాడు(జే.పంగులూరు), న్యూస్‌టుడే: గ్రామాల్లోని రైతులు రీసర్వే ద్వారా ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా సదస్సులు ఏర్పాటు చేసిందని బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. నియోజకవర్గంలోని పర్చూరు, యద్దనపూడి, మార్టూరు మండలాల్లోని రీ-సర్వే పూర్తైన గ్రామాల్లో రైతుల నుంచి వినతులు స్వీకరించారు. అన్నంబొట్లవారిపాలెం, మార్టూరు సదస్సులకు హాజరైన ఆర్డీవో వినతులను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపటడతామన్నారు. వింజనంపాడులో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్ హాజరై వినతులు తీసుకున్నారు. అనంతరం పర్చూరు మండలంలోని ఉప్పుటూరు రెవెన్యూ పరిధిలో ఆయిల్ బంకు ఏర్పాటుకు చేసుకున్న దరఖాస్తుపై గురువారం ఆర్డీవో పి.గ్లోరియా పరిశీంచారు. రీసర్వే సమయంలో దొర్లిన తప్పులను తప్పక పరిష్కరిస్తామని తహసీల్దార్ పి.పార్వతి పేర్కొన్నారు. పందిళ్లపల్లిలో గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. జే పంగులూరు మండలంలోని టి.కొప్పెరపాడులో గురువారం రెవెన్యూ గ్రామ సభ జరిగింది. తహసీల్దార్ సింగారావు మాట్లాడుతూ మొత్తం 36 దరఖాస్తులు రాగా అందులో కొలతల్లో తేడా-24, సవరణలు-6, పేరు సవరణ-2, సంయుక్త ఖాతాలు-4 సమస్యల అర్జీలు స్వీకరించామని తెలిపారు..



మార్టూరులో సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో గ్లోరియా

పోలియో రహిత సమాజాన్ని నెలకొల్పాలి

పర్చూరు, మార్టూరు, న్యూస్‌టుడే: ప్రజలు పోలియోపై అవగాహనతో మెలగాలని, పోలియో రహిత సామజ స్థాపనకు అందరూ కలిసి ముందుకు నడవాలని రోటరీ క్లబ్ ప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ అధికారులు పిలుపునిచ్చారు. గురువారం పోలియో చుక్కలపై గ్రామీణులకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలు, మానవహారాలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు, రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ వారి ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్యక్రమాలు చేపట్టారు.



మార్టూరులో మానవహారంగా ఏర్పడిన రోటరీ, ఆరోగ్యశాఖ అధికారులు

అద్దంకి, న్యూస్‌టుడే : ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా అద్దంకిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆ కార్యాలయం నుంచి అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. రోటరీ క్లబ్ కార్యదర్శి మురళీసుధాకరరావు, సహాయ గవర్నర్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

పోటీతత్వం పెంపొందించేందుకు దోహదం

చీరాలలో ఈనాడు ప్రతిభా పాటవ పోటీలు

చీరాల అర్బన్: ఈనాడు ప్రతిభా పాటవ పోటీలు చీరాలలో గురువారం ప్రారంభమయ్యాయి. ఏకే అండ్ కే ఇంగ్లీషు మీడియం స్కూల్, శ్రీగౌతమి హైస్కూల్‌లో పోటీలు జరగ్గా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటర్‌నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏకే అండ్ కే పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సీహెచ్ చెన్న శ్రీదేవి, ఎం.నాగపల్లవి, జి.మంజుశ్రీ సాధించారు. పాఠశాల కమిటీ అధ్యక్షుడు నేరేళ్ల చంద్రశేఖరరావు, కార్యదర్శి అచ్యుతుని కిరణ్‌కుమార్, కోశాధికారి శ్రీనివాసరావు, ఎడ్యుకేషనల్ ఇన్‌ఛార్జీ ఎన్.భాగ్యలక్ష్మి, ప్రధానాచార్యురాలు రూన్సీ లక్ష్మి,ఉపాధ్యాయురాలు ఉషాకిరణ్ బహుమతులను అందజేశారు. శ్రీగౌతమి హైస్కూలులో వి.సానియా, ఎం.గణపతి మణికంఠ సుబ్రహ్మణ్యం, కె.మోహనకృష్ణ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. వీరికి పాఠశాల డైరెక్టరు ఎం.సీహెచ్ వెంకటేశ్వర్లు (ఎంవీ), ప్రధానాచార్యుడు రూఫస్, ఉపాధ్యాయులు బాలయ్య, బుచ్చిబాబులు జ్ఞాపికలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు.



ఏకే అండ్ కే పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు



శ్రీగౌతమి హైస్కూల్‌లో..

డివైడర్‌లో పిచ్చిమొక్కలు



వేంకటేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో డివైడర్ మధ్యలో పిచ్చిమొక్కలు

పై చిత్రంలో డివైడర్ మధ్యలో అధికారులు ఆహ్లాదకరంగా పచ్చదనంతో కూడిన మొక్కలు పెంచుతున్నారని అనుకుంటే పొరబడినట్లే.. ఆ మొక్కలు వాటంతట అవి మొలిచిన పిచ్చి మొక్కలు. కొరిశపాడు మండలం మేదరమెట్లలో బస్టాండ్ సెంటర్ నుంచి నామ్, జాతీయ రహదారి కూడలి వరకు ర.భ.శాఖకు సంబంధించిన రహదారి మధ్యలో అయిదేళ్ల క్రితం విభాగిని నిర్మించారు. కానీ దానిలో పచ్చదనాన్ని పెంపొందించే దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గతంలో ఈ సమస్యపై ర.భ.శాఖ అధికారులను వివరణ కోరగా స్థానిక పంచాయతీ అధికారులు మొక్కల పెంపకం చేపట్టాలని తెలిపారు. కానీ ఇప్పటి వరకు ఏ శాఖ అధికారులు పట్టించుకోలేదు. దీంతో డివైడర్ మధ్యలో పిచ్చి మొక్కలు పెరిగాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి డివైడర్ల మధ్యలో పిచ్చిమొక్కలు తొలగించి ఆహ్లాదాన్ని అందించే మొక్కలు పెంచాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మేదరమెట్ల

మొసలి కోసం అటవీ అధికారుల గాలింపు



మొసలి కోసం గాలిస్తున్న అటవీ అధికారులు, స్థానికులు

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని రాజుగారిపాలెం సమీపంలోని చెక్‌డ్యాంలో బుధవారం సాయంత్రం పొలం నుంచి వస్తున్న రైతులకు ఆకస్మాత్తుగా మొసలి కనిపించినట్లు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న అటవీ అధికారి రమేశ్ ఆధ్వర్యంలో గురువారం ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వెతికినా దాని జాడ కనిపించలేదని అధికారులు వెల్లడించారు. అయితే ఉదయం దుస్తుల ఉతికేందుకు వచ్చిన వారికి అది కనిపించినట్లు తెలిపారని బీట్ అధికారి రమేశ్ చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామంలో దండోరా వేయించారు.

చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగలు



నుంచి అక్కాయిపాలెం వెళ్లే రోడ్డులో చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ప్రధానంగా గొర్రెలు, మేకల కాపరులు నిత్యం ఆ ప్రాంతంలో సంచరిస్తుంటారు. దీనికితోడు వాహనాలపై అనేక మంది రాకపోకలు సాగిస్తారు. ఆ సమయంలో అనుకోకుండా వాటికి వారు తగిలితే విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ తీగలను సరిచేయాలని వాహనదారులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

-న్యూస్‌టుడే, వేటపాలెం

త్రుటిలో తప్పిన ప్రమాదం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: అట్టపెట్టెల లోడుతో వెళుతున్న లారీ అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. ఈఘటన చీరాల-వేటపాలెం బైపాస్ రోడ్డులో గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... విజయవాడ నుంచి ఒంగోలు వైపు వెళుతున్న లారీ తోటవారిపాలెం వద్ద స్టీరింగ్ మరమ్మతుకు గురికావడంతో రోడ్డు మార్జిన్ లోకి దిగింది. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం జరగలేదు.



రోడ్డు మార్జిన్ లోకి దిగిన లారీ

ఆర్టీసీ కార్గో సేవలు విస్తృతం చేస్తాం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ కార్గో సేవలు విస్తృతం చేస్తామని చీరాల డీఎం శ్యామల పేర్కొన్నారు. గురువారం ఇంకొల్లు బస్‌స్టేషన్ సందర్శించారు. విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, నెల్లూరు ప్రాంతాలకు బస్ సర్వీసులు లేనందున కార్గో సేవలు అందుబాటులో లేవు. ఈ ప్రాంత రవాణాకు ప్రయివేటు వాహనాలు వినియోగిస్తున్నారు. స్థానిక వ్యాపారులు ఈ విషయాలను డీఎం దృష్టికి తీసుకు వెళ్లగా పరిశీలించి సర్వీసులు పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

అవీ ఇవీ

అక్రమంగా రిజిస్ట్రేషను చేశారని ఫిర్యాదు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: కొత్తపేట రెవెన్యూ డివిజన్‌లో తమ పేరున ఉన్న భూమికి ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ పూర్వపు రిజిస్ట్రార్ గంధం రాధకృష్ణమూర్తి అక్రమంగా మరోక వ్యక్తికి రిజిస్టర్ చేశారని నీరకట్టు నరేంద్ర, రాయుడు విజయశ్రీ, గాదంశెట్టి వసంతలక్ష్మి రిజిస్ట్రేషన్ శాఖ ఐజీకి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ స్థలంపై వివాదం నెలకొనడంతో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టినా రిజిస్ట్రేషన్ చేశారని, దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తాం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని ఆక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవిచంద్రన్ పేర్కొన్నారు. స్థానిక వాసవీ, వనితా క్లబ్స్ గుడ్ విల్ విజిట్‌లో భాగంగా ఆయన గురువారం చీరాల వచ్చి రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాల్లో బాగంగా స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల్లో ఉండే తల్లులు తమ పిల్లలకు పాలిచ్చేందుకు వీలుగా ఏర్పాటు చేసిన గదిని ఆయన ప్రారంభించారు.

రుణాల కంతులు సకాలంలో చెల్లించాలి

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే : పొదుపు మహిళలు తీసుకున్న రుణాల కంతులు సకాలంలో చెల్లించాలని ఏపీఎం రాజారావు అన్నారు. మండల సమాఖ్య సమావేశం గురువారం మండల సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి అధ్యక్షత వహించారు. . కంతుల సొమ్ము చెల్లించని వారికి భవిష్యత్తులో ఎలాంటి రుణాలు అందే అవకాశం కోల్పోవాల్సి వచ్చిద్దని ఆయన తెలిపారు.

భవిత కేంద్రానికి పరికరం అందజేత

జే.పంగులూరు, న్యూస్‌టుడే : భవిత కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతులకు ఉపయోగపడే జంపింగ్ వాల్‌ను దాత దేవరపలి శ్రీధర్‌బాబు దంపతులు గురువారం అందించారు. సుమారు రూ. 15 వేలు విలువ చేసే ఈ పరికరం ద్వారా విభిన్న ప్రతిభావంతుల్లో ఎన్నోరకాలైన మార్పులకు శ్రీకారం పలికే అవకాశం ఉందని శిక్షకురాలు ఇందిరా ప్రియదర్శిని అన్నారు.

విజేతకు అభినందనలు

చినగంజాం, న్యూస్‌టుడే: ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీ ప్రాంగణంలో ఆ యూనివర్శిటీ నిర్వాహకులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా తైక్వాండో అసోసియేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలల స్థాయిలో ఈ నెల 23న జరిగిన తైక్వాండో పోటీల్లో చినగంజాంకు చెందిన కె.గిరిజారెడ్డి 55 కిలోల విభాగంలో విజేతగా నిలిచి ఆల్ ఇండియా యూనివర్శిటి తైక్వాండో పోటీలకు అర్హత సాధించిందని శిక్షకుడు వాటుపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. రిజారెడ్డిని తైక్వాండో సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కే అబ్దుల్ సలామ్, ఉమ్మడి ప్రకాశం జిల్లా సంయుక్త కార్యదర్శి ఎస్‌డీ సలావుద్దీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

మార్టూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తున్నట్లు ఎంపీపీ శాంతిబాయి తెలిపారు. గురువారం మార్టూరు సర్వసభ్యుల సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై ప్రభుత్వం అందజేసే వ్యవసాయ పరికరాలు సంబంధిత అధికారుల ద్వారా పొందాలని తెలిపారు.

ప్రథమ వార్షికోత్సవం

ఎన్టీఆర్‌నగర్(అద్దంకి), : అద్దంకి పురపాలక సంఘం ఎన్టీఆర్‌నగర్‌లో ఏడాది క్రితం ప్రతిష్ఠించిన వేంకటేశ్వర స్వామి వారి శంఖు, చక్రం, నామాల వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు కాలనీ పెద్దలు వెల్లడించారు. భారీగా అన్న సంతర్పణ జరుగుతుందని వెల్లడించారు. పట్టణ వాసులు హాజరు కావాలని కోరారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన

పెదగంజాం (చినగంజాం): పెదగంజాం పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డిపాతగొల్లపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, గ్రామంలోని వారికి ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఫ్లోరోసిస్ వ్యాధిపై ఉమ్మడి ప్రకాశం జిల్లా కన్సల్టెంట్ అనిల్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వారికి విటమిన్ సి, పాలు, పెరుగు, రాగిజావ, ఆకుకూరలు, కాల్షియం ఎక్కువగా ఉన్నవాటిని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

రేషన్ సరకులు సక్రమంగా పంచాలి

చీరాల గ్రామీణం: రేషన్ డీలర్లు వినియోగదారులకు సరుకులు సక్రమంగా పంచాలని తహసీల్దార్ గోపీకృష్ణ సూచించారు. చీరాల రెవెన్యూ కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కార్డుదారులకు బియ్యం, పంచదార, కందిపప్పు అందజేస్తున్నామని, వాటిని సక్రమంగా అందించని డీలర్లపై పీడీ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

మహిళలు స్వయంసమృద్ధి సాధించాలి



మార్టును పరిశీలిస్తున్న హరికృష్ణ

అద్దంకి, న్యూస్‌టుడే : పొదుపు మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని పురపాలక శాఖ ప్రాంతీయ సంచాలకుడు హరికృష్ణ అన్నారు. అద్దంకి పురపాలక కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో మెప్మా అర్బన్ మార్టు నిర్వహించారు. మార్టును పురపాలక కమిషనర్ డి.రవీంద్ర ప్రారంభించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతిపై దర్యాప్తునకు వినతి

బాపట్ల, న్యూస్‌టుడే: చీరాల మండలం కీర్తివారిపాలెం పెట్రోలు బంకు సమీపంలో ఈ నెల 13న అనుమానాస్పద రీతిలో మృతి చెందిన పాపాయిపాలేనికి చెందిన పులి శ్రీనివాసరావు కేసును పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్పీ తుషార్ డూడీని చీరాల నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త కరణం వెంకటేష్ కోరారు. మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీని వెంకటేష్ గురువారం కలిశారు. ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరావు మరణంపై కుటుంబసభ్యులకు అనుమానాలు ఉన్నాయన్నారు. ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించాలని కోరుతూ ఎస్పీకి మృతుడి అక్క శివకుమారి, కుమారుడు కిశోర్ వినతిపత్రం అందజేశారు. ఎస్పీ స్పందిస్తూ కేసుపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయించి మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారని కరణం వెంకటేష్ తెలిపారు.

జూదరుల అరెస్టు

వేటపాలెం: రామనగర్ ప్రాంతంలో జూదం ఆడుతున్న వారిపై ఎస్సై మీసాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడిచేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 2,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

ట్రాక్టరు ఢీకొని వృద్ధురాలి మృతి

చినగంజాం: ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలి మృతి చెందారు. ఎస్సై రమేష్ వివరాల ప్రకారం... పూలవారిపాలేనికి చెందిన సోమిశెట్టి మహాలక్ష్మి (94) గురువారం ఆర్అండ్‌బీ రోడ్డు పక్క నుంచి బహిర్భూమికి వెళ్తోంది. అదే సమయంలో వ్యవసాయ పనులు చేసేందుకు రొటోవేటర్‌తో ట్రాక్టర్ డ్రైవర్ వెళుతున్నాడు. మహాలక్ష్మికి రొటోవేటర్ తగిలి తలకు తీవ్ర గాయలయ్యాయి. 108 వాహనంలో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తుండగా ఆమె మృతి చెందింది. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుడికి గాయాలు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం ఢీకొని పారిశుద్ధ్య కార్మికుడు గాయ పడిన ఘటన ఈపూరుపాలెం ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఈపూరుపాలేనికి చెందిన ఏడుకొండలు పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నారు. బుధవారం చెత్త డబ్బాలతో రహదారి దాటుతుండగా.. గుర్తు తెలియని వ్యక్తి అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో గాయాలయ్యాయి. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


జాతీయ రహదారిపై వ్యక్తిని ఢీకొన్న వాహనం

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: వేగంగా వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఒక వ్యక్తిని ఢీకొన్న సంఘటన ఈపూరుపాలెం జాతీయ రహదారి కుందేరు వంతెనపై చోటుచేసుకుంది. ఈపూరుపాలెం పోలీసుల వివరాలు మేరకు.. ఈపూరుపాలేనికి చెందిన కోటేశ్వరరావు అనే వ్యక్తిని ఈనెల 15న రాత్రి సమయంలో ఆటోనగర్ హైవే కుందేరు వంతెన వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. విషయం వాట్సాప్ సందేశాల ద్వారా కుమారుడు చెన్నకేసవులుకి రెండు రోజుల తర్వాత తెలిసింది. ఘటనపై కుమారుడు గురువారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. .

రాత్రయితే నరకమే

మేదరమెట్ల బస్టాండ్‌కు రాని ఆర్టీసీ బస్సులు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: నిత్యం వందల మంది ప్రయాణికులు తమ గ్రామాలకు వెళ్లేందుకు వేచి ఉండే కూడలి మేదరమెట్ల. స్థానిక బస్టాండుకు ఉన్న ప్రాముఖ్యత ఇది. కానీ ఇదందా కేవలం రాత్రి తొమ్మిది గంటల వరకే. ఆ తరువాత పరిస్థితి పల్లెటూరు కన్నా దారుణంగా ఉంటుంది. ఒంగోలు నుంచి వచ్చే ప్రయాణికులకు తొమ్మిదిగంటలకు వచ్చే డబుల్‌స్టాప్ బస్సు చివరిది. తర్వాత కనిగిరి, కందుకూరు, డిపో బస్సులతో పాటు హైదరాబాదు, విజయవాడ వెళ్లేందుకు బస్సులు ఉన్నాయి. కానీ అవి మేదరమెట్లలోని బస్టాండుకు రావడం లేదు. బైపాస్‌లో వెళ్లిపోతున్నాయి. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. . బస్సులు గ్రామంలోకి రావాలంటే అయిదు కిలోమీటర్లు ఎక్కువ అవుతుందన్న కారణంతో బస్సు చోదకులు బస్సును లోనికి రానివ్వడం లేదు.



మేదరమెట్ల బస్‌స్టేషన్

ఆర్ఎం దృష్టికి తీసుకువెళ్తాం

సమస్యను ఆర్టీసీ ఆర్ఎం దృష్టికి తీసుకువెళ్తాం. ఎక్స్‌ప్రెస్ బస్సులు తప్పనిసరిగా మేదరమెట్ల బస్టాండ్‌లోకి వచ్చి వెళ్లాలి. గతంలో కూడా ఇదే విధంగా సమస్య వచ్చినపుడు పరిష్కరించాం. అదే విధంగా ఇప్పుడు కూడా లోనికి రాని బస్సులపై చర్యలు తీసుకుంటాం.

-రామ్మోహనరావు, డీఎం అద్దంకి ఆర్టీసీ డిపో